

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటరమణ




వెంకటరమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఫోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జిల్లా బార్ అసోసియేషన్ మెంబరు లోలుగు వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన కీ.శే. ఎస్.వి.ఎ.భాస్కరరావు వద్ద జూనియర్‌గా ప్రాక్టిస్ చేశారు. ఈయన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులు కావడంపై బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు, బిసి అడ్వకేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బెజ్జిపురం ఫల్గుణరావు, ప్రధాన కార్యదర్శి చౌదర లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాది సనపల హరి, కస్పా ప్రతాప్‌చంద్ర అభినందనలు తెలిపారు.

జీడికి తెగుళ్ల బెడద

జీడి పంటకు తెగుళ్ల బెడత తీవ్రంగా ఉంది. టీ దోమ, పిండి నల్లి, తేనె మంచుతో జీడి పప్పు, పిందెలు రాలిపోతున్నాయి. ఏటా రైతుకు దెబ్బ మీద దెబ్బ తగలడంతో జీడి రైతులు కుదేలు అవుతున్నారు. జీడి పంటలపై అధికారులు తూతూమంత్రంగా అవగాహన కల్పించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. నాణ్యత లేని మొక్కలు పంపిణీ చేసి మామా అనిపిస్తున్నారు.



పాడైన జీడి పువ్వు

- రాలిపోతున్న పువ్వు, పిందె
- తూతూమంత్రంగా అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతం పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి కంచిలి, సోంపేటతో పాటు జిల్లాలో సుమారు యాభై వేలు ఎకరాల్లో రైతులు జీడి పంట సాగు చేస్తున్నారు. కేవలం జీడి పంటను నమ్ముకొని సుమారు 80 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. 2018లో వచ్చిన తిత్లీ తుపాను సమయంలో జీడి పంటకు తీవ్రనష్టం జరగడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరలా పాడైన చెట్లు స్థానంలో కొత్త జీడి మొక్కలను పెంచుతున్నారు.

ఆశాజనకంగా లేని జీడి

తిత్లీ తుపాను జీడి సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ఎక్కడికక్కడ జీడి చెట్లు తుపాను సమయంలో కూలిపోవడంతో రైతులు కంటతడి పెట్టుకున్నారు. ఒకవైపు నేలకు ఒరిగిన చెట్లు తొలగించేందుకు పెట్టుబడులు పెడుతుంటే మరోవైపు దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జీడికి తేనె మంచు, టీ దోమ, పిండి నల్లి తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జీడి దిగుబడి వస్తుందనే సమయంలో పంటకు తెగుళ్లు సోకడంతో పువ్వు, పిందెలు ఎండిపోయి రాలిపోతున్నాయి. మరోవైపు డిసెంబరు నెల నుంచి వర్షాలు కురవకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ ఈ ఏడాది పంట ఆశాజనకంగా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని, పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఎకరాకు సుమారు 3 బస్తాలు మించి దిగుబడి వస్తే ఈ ఏడాది ప్రస్తుత పరిస్థితుల్లో రెండు బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

నష్టాలు చవిచూస్తున్న జీడి రైతులు

గత మూడేళ్లుగా రైతులు నష్టాలు చవిచూశారు. గతేడాది జీడి పిక్కల దిగుమతి బాగానే పెరిగిందని చెప్పారు. కానీ, గిట్టుబాటు ధర లేకపోవడంతో నిరాశే మిగిలింది. దిగుబడి చూసి రైతు ఆనందం వ్యక్తం చేస్తున్న సమయంలో జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గతేడాది జీడి పిక్కల బస్తా ప్రారంభంలో రూ.8 వేలు ధర పలుకగా, ఒక్కసారిగా బస్తా రూ.6 నుంచి 7 వేలుకు ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొంతమంది రైతులు తమ సొంత అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో రూ.5 నుంచి 6 వేలకూ అమ్మకాలు చేపట్టారు. గతేడాదికి ముందు జీడి పిక్కల బస్తా రూ.12 నుంచి రూ.14 వేలుకు ధర పలికేది.

అరకొరగా జీడి మొక్కలు పంపిణీ

జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తుండగా, తిత్లీ తుపాను సమయంలో 22, 723 ఎకరాల్లో పంట నాశినమైంది. దీంతో వేల సంఖ్యలో జీడి రైతులు పాడైన జీడి చెట్లు చూసి కంటతడి పెట్టారు. అయితే జీడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీడి మొక్కలను పంపిణీ చేసేందుకు ముందుకొచ్చింది. ఈ ఏడాది 387 ఎకరాల్లో 286 మంది రైతులకు 23,052 మొక్కలు పంపిణీ చేశారు. గత రెండేళ్లుగా 1500 ఎకరాల్లో సుమారు 700 మందికి జీడి మొక్కలను పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. కానీ, వాస్తవానికి ఆ స్థాయిలో మొక్కలు పంపిణీ చేయలేదని, నాశిరకం మొక్కలను పంపిణీ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా జీడి పంటపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉంది. కానీ, మొక్కుబడిగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

సదస్సు నిర్వహించలేదు



వర్షాలు సకాలంలో కురవక పోవడం, తేనె మంచు, టీ దోమ సోకడంతో జీడి పువ్వు నాశనమైంది. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారులు పూర్తి స్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహించలేదు.

- సాతుపల్లి కృష్ణారావు, జీడి రైతు, వజ్రపుకొత్తూరు మండలం

నాణ్యమైన మొక్కలు కావు



జీడి రైతులకు ఇచ్చిన జీడి మొక్కలు నాణ్యమైనవి కావు. ఇచ్చిన మొక్కలు అరకొరగా పంపిణీ చేశారు. తిత్లీ తుపాను నుంచి జీడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

- తెప్పల అజయ్‌కుమార్, జీడి రైతు మాకన్నపల్లి

ఎకరాకు 80 మొక్కల పంపిణీ

తిత్లీ తుపానులో పాడైన జీడి చెట్లు స్థానంలో కొత్త జీడి మొక్కలను పంపిణీ చేశాం. ఎకరాకు 80 మొక్కలు ఇచ్చాం. ఇచ్చిన మొక్కల్లో ఎమైనా చనిపోతే వాటి స్థానంలో మరలా మొక్కలు ఇస్తున్నాం. జీడి మొక్కల నిర్వాహణకు ఎకరాకు రూ.5 వేలు రైతుల ఖాతాలో జమ చేశాం. జీడి పంటకు తెగుళ్లు సోకడం వాస్తవమే. వాటి నివారణకు మందు పిచికారీ చేస్తే సరిపోతుంది.

- ఆర్.ప్రసాదరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి



ధర్నా చేస్తున్న కార్మికులు

బలవంతపు ఉద్యోగ విరమణ ఆపాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం వరిశాం వద్ద ఉన్న శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమలో బలవంతపు ఉద్యోగ విరమణ ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేసారు. 30 ఏళ్లు సర్వీసు పూర్తయిందని బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, జెసిఎల్ ఆదేశాలు అమలు చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ... సిఐటియు ఆధ్వర్యాన శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో ఉద్యోగ విరమణ వయసు కాకుండానే ఎక్కడా లేనివిధంగా 30 ఏళ్లు సర్వీసు పూర్తయిందని కార్మికులను యాజమాన్యం వారు బలవంతపు ఉద్యోగ విరమణ చేస్తూ కార్మికులను రోడ్డున పెడుతున్నారని అన్నారు. ఈ విధంగా ఇప్పటివరకు 50 మంది కార్మికులను రోడ్డున పడేశారని అన్నారు. పది నుంచి 12 ఏళ్లు సర్వీసు ఉన్నా... కార్మికులను తొలగించడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం 58 ఏళ్ల వయసు పూర్తయితేనే ఉద్యోగ విరమణ చేయాలని అన్నారు. జాయిన్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని అన్నారు. శ్యాంపిస్టన్స్ యాజమాన్యం కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తుందని తెలిపారు. అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బలవంతపు ఉద్యోగ విరమణ ఆపకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. జెసిఎల్ ఆదేశాలు యాజమాన్యం అమలు చేసేలా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో శ్యాంక్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.అప్పలనర్సయ్య, నాయుకులు ఎం.కూర్మారావు, జె.రాము, గొర్లె కృష్ణ, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్ శిక్షణ ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి కె.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్‌టిసిలో హెవీ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడ డ్రైవింగ్‌తో పాటు మెలకువలు నేర్చుకునేందుకు వీలుందన్నారు. రానున్న రోజుల్లో డ్రైవర్లకు ఆర్‌టిసిలో శిక్షణతో పాటు, హెవీ లైసెన్స్ ఐదేళ్ల తర్వాత రెన్యూవల్ చేసుకునే సమయంలో ట్రైనింగ్ ధ్రువపత్రం అవసరమన్నారు. దానికి ఈ ట్రైనింగ్ ధ్రువపత్రం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధన ప్రకాంధీ ధ్రువీకరణ పత్రం అవసరమన్నారు. అలాగే శిక్షణ పొందిన వారికి లైసెన్సు పొందడానికి తోడ్పడుతుందన్నారు.డ్రైవర్లకు ఆర్‌టిసితో పాటు ఇతర ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. దీనికి తోడు లైసెన్స్ విధానంలో మారిన సాంకేతిక విధానాలతో సారధి పరివాహన్‌లో లైసెన్స్ ఇస్తామని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థు లు ఫీజు ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



మాజీ సైనికులతో ఎస్‌పి రాధిక

ఎన్నికల విధులకు మాజీ సైనికుల పేర్లు నమోదు చేసుకోవాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు మాజీ సైనిక ఉద్యోగస్తులు స్వతహాగా ముందుకు రావాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సైనిక బోర్డులో సభ్యత్వం ఉన్న మాజీ సైనిక ఉద్యోగస్తులతో ఎన్నికల విధులపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు షెడ్యుల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో మే 13న సార్వత్రిక ఎన్నికలు జరుగునున్నాయని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి గల, ఉత్సాహవంతులైన 60 ఏళ్ల లోపు మాజీ సైనికులు స్వతహాగా వ్యక్తిగత వివరాలతో ఈ నెల 25లోగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉంటూ... ఎటువంటి క్రిమినల్ కేసులు లేని క్రమశిక్షణ కలిగిన మాజీ సైనికులను ఎన్నికల విధులకు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా ఎన్నికలు విధులు పారదర్శకంగా నిర్వర్తించాలన్నారు. రెండు రోజులు పాటు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ క్రమబద్ధకరణ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ ప్రేమకాజల్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, ఎస్‌బి డిఎస్‌పి త్రినాథరావు, జిల్లా సైనికుల సమాఖ్య మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్ర, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.


'ప్రజాగళం' విజయవంతం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి, జనసేన, బిజెపి సంయుక్తంగా చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభ కూటమి అభ్యర్థులతో పాటు కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. లక్షలాదిగా ప్రజలు ప్రజాగళం సభకు తరలిరావడం శుభ పరిణామని అన్నారు. జగన్ అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదింపే సమయం దగ్గర పడిందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని, రాజధాని లేకుండా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ఐదేళ్ల పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. గత ఎన్నికల సమయంలో ఆడిన కోడికత్తి డ్రామా, చిన్నాన్నపై గొడ్డలి వేటు డ్రామాలు ప్రజలు నమ్మారని, అందువల్లే ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేయగలిగారని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తో టిడిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేస్తే... గడచిన ఐదేళ్లలో డయా ఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి జగన్ కారణమయ్యారని ఆరోపించారు. వైసిపి హయాంలో ప్రాజెక్టులన్నీ అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. ఆర్థిక దుర్వినియోగం, అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో వైసిపి ప్రభుత్వ పాలన సాగిందన్నారు. ప్రభుత్వ ఆస్తులు, కలెక్టరేట్ కార్యాలయాలు, రైతుబజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో పాటు చివరకు రాష్ట్ర సచివాలయాన్నీ తాకట్టు పెట్టారన్నారు.

మద్యం అక్రమ రవాణాపై చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి సుబ్బారావు



అవగాహన కల్పిస్తున్న సుబ్బారావు

ఎచ్చెర్ల: ఎన్నికల నియమావళిని ఎవరూ దాటొద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.సుబ్బారావు ఎక్సైజ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఎచ్చెర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ఎక్సైజ్ శాఖ సిబ్బందితో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సోమవారం అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బారుల వద్ద, షాపు లోపల, బయట రాజకీయ నాయకుల ఫొటోలు ఉండరాదన్నారు. షాపుల వద్ద సిసి కెమేరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పుస్తకాలు అన్ని అప్‌డేట్‌గా ఉండాలన్నారు. షాపులు ఉదయం 11 నుంచి రాత్రి 10 వరకు తెరచి ఉండాలన్నారు. ఒక వ్యక్తికి మూడు బాటిళ్లు వరకు మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. ఎవరైనా ఒక వ్యక్తి మూడు మూడు బాటిళ్లు చొప్పున తీసుకువెళ్లినా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్ యజమానులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినచో కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ కంట్రోల్ రూమ్ నంబరు 7989343418 అని అన్నారు. సమావేశంలో శ్రీకాకుళం యూనిట్ సిఐ కె.లక్ష్మి, పలాస డివిజన్ ఐ.ఇందుమతి, ఎస్ఐలు పి.రాజగోపాల్, పివివిఎస్ఎన్ మూర్తి, ఎ.రాజ్యలక్ష్మి, ఎం.వేణు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- 145 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- 29,243 మంది విద్యార్థులు హాజరు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాల్లో 29,243 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 458 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడంతో గేట్లు వద్ద విద్యార్థులు పడిగాపులు ఉండాల్సిన అవసరం రాలేదు. కలెక్టర్ మనీజీర్ జిలానీ సమూన్, డిఇఒ కె.వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రాలు సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఎస్‌పి జి.ఆర్. రాధిక స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 29,243 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా, 28,785 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో హాజరు శాతం 98.43గా నమోదైంది. పరీక్షకు 458 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు హాజరవుతున్న వారికి ఆర్‌టిసి ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో 145 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 15 సిట్టింగ్ స్క్వాడ్స్, ఏడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 1350 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారు.

కలెక్టర్ పరిశీలన

జిల్లాలో సజావుగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా నగరంలోని అరసవిల్లి రోడ్డులో గల కేశవరెడ్డి స్కూల్‌లో నిర్వహిస్తున్న పది పరీక్షా కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ విద్యార్థులు సజావుగా పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాట్లను పరిశీలించారు. పూర్తి స్థాయిలో గదుల్లో వెలుతురు ఉండేటట్లు చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలతో పాటు వేసవి దృష్ట్యా విద్యార్థినీ, విద్యార్థులకు తాగునీరు సదుపాయం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ టి.నారాయణమూర్తి, విద్యాశాఖ పర్యవేక్షణ అధికారి దయానందకుమార్ పాల్గొని ఏర్పాట్లను వివరించారు. జిల్లాస్థాయి పరిశీలకులు ఎనిమిది మంది, డిఇఒ, డెప్యూటీ డిఇఒ స్థాయి అధికారులు నలుగురు, పరీక్షల రాష్ట్ర పరిశీలకులు నాలుగు కేంద్రాల్లో పరిశీలించారు. 57 కేంద్రాలను తొలి రోజున తనిఖీ చేశారు.

ఎన్నికల నిబంధనలపై ప్రత్యేక కవాతు



కోటబొమ్మాళి : కవాత్‌తో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి రాజకీయ బోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్స్ ఉండకూడదని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. వాటిని పరిశీలించేందుకు సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కుమర్ ఆధ్వర్యాన కొత్తపేట కూడలి నుంచి కోటబొమ్మాళి వరకు కేంద్ర రైల్వే సహాయక బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు సంబంధించిన ఫొటోలు, ఫ్లక్సీలు ఉండరాదని అన్నారు. ఎన్నికల రీత్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లలో అవగాహన కల్పించేందుకు ఈ కవాత్ నిర్వహిస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహశీల్దార్ లచ్చపాత్రుడు, ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ, టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, ఎస్ఐ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

శ్రీకాకుళం అర్బన్ : కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సందర్శించారు. కొత్త కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఎంసిఎంసి, సోషల్ మీడియా, డిస్ట్రిక్ట్ కాంటాక్టు సెంటర్ 1950, కంప్లైంట్ మోనిటరింగ్ సెల్, పోలీసు కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సీ-విజిల్‌లను ప్రస్తుతం ఏర్పాటు చేయగా, ప్రతి విభాగంలో ఎవరు ఏమి చేస్తున్నదీ వివరాలను అడిగి తెలుసుకొని ఆయా విభాగాల్లో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు, జిపియస్ వాహనాలు హాజరైన సమయాలను వెళ్లిన రూట్లను, తదితర వాటిని పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ఈయనతో ఆపటు జెసి ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆయా విభాగాల నోడల్ అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్...

టెక్కలి రూరల్ : స్థానిక డిగ్రీ కళాశాలలో వివిఎంల భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో, పోలీసులతో సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాల నుంచి స్థానిక ఇందిరా గాంధీ కూడలి వరకూ కవాత్ నిర్వహించారు. అలాగే రావివలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈయనతోపాటు టెక్కలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, తహశీల్దార్ ఆర్.బాలమురళీకృష్ణ, ఎంపిడిఒ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

లైసెన్సు తుపాకీలు స్వాధీనం

శ్రీకాకుళం : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టర్, ఎస్‌పి జి.ఆర్ రాధికలతో కూడిన స్క్రీనింగ్ కమిటీ సమావేశమై లైసెన్స్ కలిగిన ఆయుధాలపై సమీక్షించారు. బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, ఎటిఎం కేంద్రాలకు డబ్బులు తీసుకువెళ్లే సెక్యూరిటీ ఏజెన్సీలు, క్రీడా ఈవెంట్లు నిమిత్తం తప్ప మిగతా వ్యక్తులు తమ ఆయుధాలు డిపాజిట్ చేయాలని ఆదేశించారు. వాటిని డిపాజిట్ చేయక పోయినా, అక్రమంగా కలిగి ఉన్న వారిపై ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 254 లైసెన్సులకు గాను, వివిధ రకాల 273 తుపాకులు ఉన్నాయని, వాటిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డుల వద్ద 47, క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వద్ద ఉన్న 28 తుపాకులకు మినహాయింపు ఇచ్చామని తెలిపారు. మిగిలిన ప్రయివేటు వ్యక్తుల వద్ద ఉన్న అన్ని తుపాకీలు స్థానిక పోలీస్ స్టేషన్ల ద్వారా నిబంధనల ప్రకారం ఎస్‌పికి డిపాజిట్ చేశారని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సార్వత్రిక ఎన్నికల నేపథ్యం రాజకీయ పార్టీలతో పాటు ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి ఎం.నవీన్ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత రాష్ట్రంలోనూ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ 18న నోటిఫికేషన్, మే 13న ఎన్నికలు, జూన్ 4న ఫలితాలు రానున్నాయని తెలిపారు. అప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అన్నివిధాలా సహకరించాలని కోరారు. ప్రజలు కూడా వివిధ రాజకీయ పార్టీలతోపాటు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చూపించే ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. అంతే కాకుండా వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసుకునే అవకాశం ఉందని అటువంటి వారు నిబంధనల మేరకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీలు ఎటువంటి సమావేశాలు ర్యాలీలు నిర్వహించాలన్న ముందుగా ఆర్ఒ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల సందర్భంగా నెలకొన్న ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఎవరైనా కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే తనతోపాటు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారీ తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబరు 9032318521కు ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. టోల్ ఫ్రీ నంబరు 1950కు ఫోన్ చేసి సందేహాలు ఫిర్యాదులు తదితర విషయాలను తెలుసుకోవచ్చని అన్నారు. ఆమదాలవలస ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన జర్నలిస్టులు ప్రచారంలో జరుగుతున్న లోపాలను ఇతర విషయాలను చిత్రీకరించేటప్పుడు రాజకీయ నాయకులు వారి అనుసరలు దాడులు చేసే అవకాశం ఉందని అన్నారు. అటువంటి సంఘటనలు జరగకుండా జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, తహశీల్దార్లు కె.వేణుగోపాల్, రమేష్‌బాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ తదితరులు

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కల్లెమ్మలో నేతాజీ నగర్ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న 190 సర్వే నంబర్‌లోని 25.22 ఎకరాల విస్తీర్ణం గల తామర చెరువులో ఆక్రమణలు తక్షణమే ఆపాలని, ఎంతో విలువైన ఆ స్థలం రెవెన్యూ సిబ్బంది చేతివాటం చూపించి ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పారని, ఈ భూమిని కల్లెమ్మ గ్రామ ప్రజల మౌలిక సదుపాయాల అవసరాల మేరకు ఉపయోగ పడేటట్టు చేయాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కల్లెమ్మ గ్రామ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ నాయుడు కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కల్లెమ్మ గ్రామ మాజీ సర్పంచ్ యొద్దు కన్నంనాయుడు, లోతుగడ్డ తిరుపతిరావు, శ్రీను, చోడవరపు గోవిందరావులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చిన్నబాడాం పోస్టుమేన్ పి.రాజేశ్వరి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ చిన్నబాడాంకు చెందిన బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ నాయుడు తదితరులు ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. చిన్నబాడాం పోస్టుమేన్ ఆధీనంలో చిన్నబాడాంకు చెందిన వైసిపి నాయకులు జద్దాడ చంద్రశేఖర్, అట్టాడ ప్రసన్నకుమార్, డిక్కల నిరంజన్, డిక్కల లక్ష్మణరావు, దువ్వాడ రమణారావు, సనపల రవికుమార్, కూర్మాపు ధర్మారావు, సుందరరావు, కోన శ్రీనివాసరావులతో కలిసి రాజేశ్వరి కొత్తగా వచ్చిన ఓటరు ఐడి కార్డులు పంపిణీ చేస్తుండగా దానిని తాము గమనించామని ఆర్‌డిఒకు తెలిపారు. బడ్డ నాగరాజు ఆమెకు ఫోన్ చేసి కోడ్ ఉన్న సమయంలో కలిసి కార్డులు పంపిణీ చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పగా, తనకు ఓటర్ల చిరునామాలు తెలియకపోవడంతో వారిని వెంట పెట్టుకొని వెళ్లడం జరిగిందని ఆమె వివరణ ఇచ్చారని, ఈ మేరకు ఆమెతో తాను మాట్లాడిన ఫోన్ సంభాషణ పెన్ డ్రైవ్‌లో పొందుపర్చి ఫిర్యాదుతో పాటు అందించడం జరుగుతుందన్నారు. దీనిపై స్పందించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆయనతో పాటు టిడిపి నాయకులు ఆర్‌డిఒను కోరారు.


ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్న స్పీకర్ సీతారాం

స్పీకర్ ప్రచారం

ఆమదాలవలస : సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం సరుబుజ్జిలి మండలం దకరవలస, సుభద్రాపురం, సూర్యనారాయణ పురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైసిపి సర్కారుకే దక్కిందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించి, గ్రామ రూపు రేఖలు మార్చిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కెజిఆర్ సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, జిల్లా బిసి సెల్ డైరెక్టర్ ముద్దడ రమణ, ఎస్‌సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.


లఘు నాటికను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాలాజీ

ఆలోచింపచేసేలా లఘు నాటిక

ఎచ్చెర్ల: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైనదని, ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో ఎదురవుతున్న ముఖ్యమైన సమస్యలు, ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగం వంటి అంశాలపై డాక్టర్ ఎం.పి. సూరి గణేష్ రూపొందించిన లఘు నాటికను రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు రాజ్యాంగం ఇచ్చిన అమూల్యమైన హక్కుని, దానిని అందరూ సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి. సుధాకర్ బాబు మాట్లాడుతూ https://youtu.be/Sctnlng9KWE లింక్ ద్వారా షార్ట్ ఫిల్మ్ చూడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, అకాడమిక్ డీన్ కె.మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఎస్.అసిరినాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

విఎల్‌టి సమస్యతో ఇబ్బందులు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో ఉన్న ఖాళీ ప్రదేశాలకు నగరపాలక సంస్థ విధించిన వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (విఎల్‌టి) చెల్లించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని వెల్ఫేర్ అసోసియేషన్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, చైర్మన్ మురళీకృష్ణలను జిల్లాలోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) అధ్యక్షతన హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో సోమవారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. విఎల్‌టి చెల్లింపులు సక్రమంగా జరగక సమయం వృథా అవుతుందని అన్నారు. దీనివల్ల ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. సమావేశంలో జాయింట్ ట్రెజరర్ హిదయ తుల్లా, గౌరవ అధ్యక్షులు కె.వెంకటేష్, సెక్రటరీ వాండ్రంగి శ్రీనివాస్, ట్రెజరర్ జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం

సోంపేట: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం పట్టణంలో పలు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాబా కాలనీ, బిఎస్ కాలనీ, రేకుల కాలనీ తదితర వీధుల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలపై వివరించారు. ప్రతిఒక్కరు చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో చిత్రాడ శేఖర్, మద్దిల నాగేశ్వరరావు, సూరడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మడ్డు రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: మండలం జగతిలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అశోక్, ఎంపి రామ్మోహన్ నాయుడును మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసు శాఖ ముందస్తు అవగాహన కార్యక్రమంలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో డిఎస్‌పి వై.శృతి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. సోమవారం మండలంలోని వంజంగి, కనుగులవలస గ్రామాల్లో పట్టణంలోని మెట్టక్కివలసలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్, ఎస్ఐ కె.వెంకటేష్, స్థానిక పోలీసులతో పాటు ఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆరోగ్యం, పారిశుధ్యం, ప్లాస్టిక్ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండలం ఎస్.ఎం.పురం, ఎచ్చెర్ల గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు ప్రతిరోజు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ర్యాలీలు, మొక్కలు నాటడం, డిజిటల్ లిటరసీ, ఆరోగ్యం, పారిశుధ్యం, ప్లాస్టిక్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఎఒ ముని రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా మానసిక ఒత్తిడిని


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ

జయించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి.సుధాకర్ బాబు, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డా.అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, పిఒలు డా.వి.సింహాచలం, డా.జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గురండిలో సోమవారం వెంకటేశ్వర డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారం రోజులు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు తెలిపారు. విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త ఎక్కడపడితే అక్కడ వేయరాదని, చెత్తబుట్టలు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాసరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 3వ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మండలంలోని ధర్మనీలాపురంలో సేవా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ప్రారంభించారు.రీ శిబిరంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. పిఒ డి.వాసుబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ప్రోగ్రాం అధికారి డి.వాసుబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు అడ్డగింత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బెండి గ్రామం మీదుగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. రైతుల పొలం నుంచి మట్టిని ఇటుక బట్టీల కోసం యజమానులు గత కొద్ది రోజులుగా తరలిస్తున్నారు. బెండి గ్రామం వద్ద రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయింది. మట్టి ట్రాక్టర్లు వెళ్తున్నప్పుడు దుమ్ము, ధూళి భారీగా ఇళ్లలోకి వస్తుందని, దుమ్ము, ధూళి వలన ఆరోగ్య సమస్యలకు గురవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత యజమానులు మట్టి తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దుమ్ము, ధూళి ఎగరకుండా ట్యాంకర్ ద్వారా నీటిని రోడ్డుపై స్ప్రేచేస్తామని స్థానికులకు యజమాన్యం హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలో వాండ్రంగి, ఆనందపురం గ్రామాల్లో ఎంపిడిఒ కె.వెంకన్నబాబు సచివాలయాలను సందర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో కార్యదర్శులు, విఆర్ఒలు, బిఎల్ఒలు, ఉద్యోగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రికార్డులు పరిశీలించి ఎన్నిక నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీ శంకరరావు, పైల జయరాం, కూనిబిల్లి కోటేశ్వరరావు, పొగిరి రాము, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


కొత్త పరిమళం నాటికలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న 'కొత్త పరిమళం'

ప్రజాశక్తి- కవిటి

తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా తొర్రూరులో చైతన్య కళా సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పన్నెండో జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటికపోటీల్లో మండలం బొరివంక గ్రామానికి చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటిక ఉత్తమ ప్రదర్శనతో విమర్శకుల ప్రశంసలతో పాటు ఆహుతుల హృదయాలను గెలుచుకుంది. ఈ ప్రదర్శనలో ఉత్తమ ఆహార్యంగా ఎస్.రమణ, ఉత్తమ సంగీతం పి.లీలామోహన్, ఉత్తమ ప్రతినాయకుడుగా బి.చలం, ఉత్తమ ప్రదర్శనగా కొత్త పరిమళం బహుమతులు గెలుచుకుని సత్తా చాటింది. ఈ సందర్భంగా తమ నాటిక ప్రదర్శనకు అవకాశం కల్పించిన చైతన్య కళా సమైఖ్య కార్యవర్గ సభ్యులకు శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

టెక్కలి : స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అధాలత్‌లో 155 కేసులు పరిష్కారం జరిగినట్లు ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో మరో బెంచ్ ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించామన్నారు. ఈ లోక్ అధాలత్‌లో దవళ రాజేశ్వరరావు, ఎ.వైకుంఠరావు, బి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయ వాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా 'కణితి'



ఆమదాలవలస : జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది కణితి విజయలక్ష్మి బాయ్ మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ సాధించా రు. బార్ అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికలకు శుక్రవారం ఆమె నామినేషన్ వేయగా వేరొక నామినేషన్ దాఖలు కాకపోవడంతో సోమవారం ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది సాదు ధనంజయరావు అధ్యక్షులుగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రమణమూర్తి, కార్యదర్శిగా అల్లాడ విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బొడ్డేపల్లి మోహనరావు ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

ఆమదాలవలస త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమదాలవలస నియోజవర్గం నుంచి మరో స్వతంత్ర అభ్యర్థి రంగంలోకి దిగేందుకు ముందుకు వచ్చారు. బూర్జ మండలం గుత్తావల్లికి చెందిన సనపల సురేష్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కొంతకాలం నుంచి కుటుంబ పాలన నడుస్తుందని, దానికి స్వస్తి పలకాలన్నారు. తాను సామాన్యుడునని రైతు కుటుంబం నుంచి వచ్చానని, తనకు ప్రజల సాధక బాధలు తెలుసన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

నౌపడ : సంతబొమ్మాళి మండలం చిన్న మర్రిపాడులో సాల్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ అట్టాడ కల్పన ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించి మూడు రోజులు పాటు నిర్వహించిన యాత్ర సోమవారంతో ముగిసింది. సంతబొమ్మాళి, నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, వజ్రకొత్తూరు, పలాస మండలాల నుంచి వేలాది సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నౌపడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆహారం పంపిణీ, మజ్జిగ, తాగునీటిని యాత్రికులకు సరఫరా చేశారు.

ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డిఆర్‌డిఎ పిడి ఆదేశాలు మేరకు మండలంలో ఓటర్లుకు ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్లు అతికించారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం వెలుగు సిబ్బంది మండలంలో ఎన్నికల కమిషన్ పిడి ఆదేశాల మేరకు పోస్టర్లను అన్ని కూడళ్లలో అతికించినట్లు తెలిపారు. బ్యాంక్, పోస్టాఫీస్, రైల్వేస్టేషన్, మండల సమాఖ్య ఆవరణలో గోడలపై అతికించడం ద్వారా ఓటర్లకు అవగాహన కలుగుతుందన్నారు. సిసి మోహన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతంలో 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు కలిగి ఉండాలని, ఓటుహక్కు కలిగి ఉన్న వారంతా తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని మండల మహిళా సమాఖ్య



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల మహిళలు

ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. మండలం అక్కివరం, జొన్నవలస, తొగరాం గ్రామ సంఘాల పరిధిలో మహిళలతో ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వయోజనులంతా ఓటుహక్కును కలిగి ఉండడంతో పాటు శాతశాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా మహిళలంతా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు స్వయం శక్తి సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

పార్టీల జెండాలు, బ్యానర్లు తొలగింపు


పాతపట్నం : ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో మండలం కేంద్రంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, జెండాలను మండల తహశీల్దార్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సోమవారం తొలగించారు. అలాగే మండలం కేశవరావుపేటలో గ్రామంలో ఉన్న జెండాలను విఆర్ఒ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది తొలగించారు.

వజ్రపుకొత్తూరు: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాన కూడళ్లలో ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. బెండి గ్రామ బస్టాండ్ సమీపంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ జన్మదిన వేడుకలకు సంబంధించి పోస్టర్లును పోలీసు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి తొలగించారు. నగరంపల్లి బస్టాండ్‌పై ఉన్న రాజకీయ నాయకుల పేర్లుపై స్టిక్కర్లను అతికించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరు కోడ్ ఉల్లంఘించరాదని డిటి వాయిలపల్లి గిరిరాజ్ కోరారు.

పాతపట్నం: స్థానిక ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలను ఆయన దగ్గరుండి తొలగించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సమావేశం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సమస్యలను పరిష్కారానికే సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి భాస్కరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమలులో ఉన్నందున ఎన్నికల నిబంధనల లోబడే సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు మాట్లాడుతూ మండలంలో సజావుగా 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25శాతం ప్రైవేట్ స్కూల్‌లో ఫీజు లేకుండా ఉచిత విద్య అమలు చేయడానికి రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయన్నారు. అనంతరం కరజాడ గ్రామ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఈశ్వరమ్మ

సర్పంచ్ బమ్మిడి పున్నయ్య మాట్లాడుతూ టెక్కలిపట్నం టు గొప్పిలి రహదారి నిర్మించి రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి సద్దకపోవడంతో ఇరువురు మృతి చెందారని, పలు ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేసంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, ట్రైకార్ డైరెక్టర్ సుభాష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపిపి కార్యాలయంలో ఎంపిడిఒ డిక్కల తిరుమలరావుతో సమీక్ష చేసారు. మండలంలో ఉండ్రకుడియాలో తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయన్నారు.

గ్రామంలో 500 అడుగుల లోతుకు వెళ్లినా బోరు పడిన పరిస్థితులు లేవన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు ట్రయల్ రన్ జరుగుతుందన్నారు. ఇంటింటికి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇది ట్రయల్ రన్‌లో ఉన్నందున కేవలం వాడుకల కోసం మాత్రమే ఆ నీటిని వినియోగించుకోవాలని సూచించారు. జలజీవన్ మిషన్ ద్వారా అందించే తాగునీరు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చే వరకు ట్యాంక్‌ల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వేసవిలో ఏ గ్రామంలోనూ తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపిడిఒకు సూచనలు చేశారు. సమావేశంలో సిబ్బంది లావణ్య కుమార్ ఉన్నారు.

అనధికారికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

టెక్కలి ఉపవిద్యాశాఖ కార్యాలయంలో నగేష్, సురేష్ అనే ఉపాధ్యాయులు మొత్తం కార్యాలయాన్ని తమ అదుపులో పెట్టుకుని వ్యవహారాలు నడుపుతున్నారని, వారిపై శాఖాపరంగా విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఇఒ డిఇఒ కె.వెంకటేశ్వరరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పాట్ వేల్యూషన్‌కి సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులకు, చిన్న పిల్లల తల్లులకు, వయసు పైబడిన వారికి కోరుకున్న సందర్భంలో స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా స్పాట్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బూరావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు హనుమంతు అన్నాజీరావు, జి.సురేష్, ఎస్.స్వర్ణకుమారి, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య, ఆర్.త్రినాథరావు, పి.గోవిందరావు, జె.రవి పాల్గొన్నారు.



ఎస్‌డిపి పరికరం ద్వారా రక్తాన్ని సేకరిస్తున్న సిబ్బంది

ఎస్‌డిపి పరికరం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సింగిల్ డోనర్ రక్తాన్ని సేకరించడానికి వీలుగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఎస్‌డిపి పరికరాన్ని బ్లడ్ బ్యాంకులో అమర్చారు. ఈ పరికరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతులై 55 కిలోల బరువుతో ఉండి, 13 శాతం హిమోగ్లోబిన్ ఉండే ప్రతిఒక్కరూ రక్తదానం చెయ్యవచ్చని అన్నారు. అపోహల వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రస్తుతం రక్త నిల్వల కొరత ఉందని, సీజనల్‌గా ఎదురయ్యే అవసరాల కోసం ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని అన్నారు. ప్లేటిలెట్స్ సంఖ్య తగ్గడం సమస్య తీవ్ర మవుతోందన్నారు అందువల్ల సింగిల్ డోనరు రక్తాన్ని సేకరించడం ద్వారా ప్లేట్ లెట్స్ తిరిగి పెంచుకునేందుకు వీలుందన్నారు. కార్యక్రమంలో లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, మదర్స్ లవ్ ఫౌండర్ సుప్రజ రౌత్, రెడ్‌క్రాస్ వైద్యులు జి.ఆర్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి- కొత్తూరు


కళ్యాణ్ (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కడగండికి చెందిన పాలక కళ్యాణ్ (15) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం సీతంపేట నుంచి కొత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై మృతుడు కళ్యాణ్, భామిని మండలం లోహరజోలకు చెందిన నిమ్మల కృష్ణవంశీ, బురుజోలకు చెందిన ఊయక మణికంఠ ద్విచక్ర వాహనంపై సీతంపేటలో పార్క్, వాటర్ ఫాల్స్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా కర్లెమ్మ పంచాయతీ మహాసింగి వద్ద కొత్తూరు నుంచి వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రగాయాల పాలయ్యారు. ఆ సమయంలో పాలకొండ నుంచి కొత్తూరు వస్తున్న మహాసింగికి చెందిన గ్రామ వాలంటీర్ నరేష్ చూసి వెంటనే 108కు సమాచారం అందించగా 108 ద్వారా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా వారు జెమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. అప్పటికే కళ్యాణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇద్దరు స్నేహితులు తీవ్రగాయలతో వైద్యం పొందుతున్నారు. మృతుడు ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి పదేళ్ల క్రితం మృతి చెందగా, తల్లి రమణమ్మ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో కుక్‌గా పనిచేస్తుంది. తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ


లోకనాథం (ఫైల్)

సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం దేవనల్తాడకు చెందిన తేరిపిల్లి లోకనాథం (33) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లోకనాథం చిన్న మర్రిపాడులో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జాతర నుంచి వస్తున్న అదే గ్రామానికి చెందిన ఆటో పెద్ద మర్రిపాడు చెరువు వద్ద ఉన్న రోడ్డు మలుపులో ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు గాయమైంది. సమాచారం అందుకున్న నౌపడ పోలీసులు క్షతగాత్రుని టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే లోకనాథం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవనల్తాడ సర్పంచ్ తేరిపిల్లి వరదరాజు చిన్న సోదరుడు. దీంతో దేవునల్తాడలో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనపై నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు గాయాలు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యామాలపేట స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్‌పై నుంచి జారిపడి సోమవారం సంతబొమ్మాళి మండలం బడే నరసాపురానికి చెందిన మహిళ తిప్పన హైమావతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బడే నరసాపురంకు చెందిన తిప్పన మల్లేసు, హైమావతి మర్రిపాడు ఎల్లమ్మ జాతరకు వెళ్లి తిరిగి వస్తుండగా యామాలపేట వద్ద స్పీడ్‌బ్రేకర్ గమనించకుండా వెళ్లడంతో ప్రమాదం జరిగింది. వెనుక కూర్చున్న హైమావతి స్పీడ్‌బ్రేకర్ వద్ద ఎగిరి రోడ్డుపై పడడంతో తలపై బలంగా గాయమైంది. దీంతో స్పృహ కోల్పోయిన ఆమెను స్థానికులు ప్రైవేటు వాహనంలో టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, ముద్దాయితో పోలీసులు

20 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో ఒడిశాకు చెందిన కరుణకరడ అనే వ్యక్తి 20 కేజీల గంజాయి ప్యాకెట్‌ను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా కాశీబుగ్గ పోలీసులు చాకచక్యంగా ఆయనను పట్టుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎం.వెంకటరావు వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి బ్లాక్ రాజార్ గ్రామానికి చెందిన కరుణకరడ చెన్నైలో ఇటుక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన ఒడిశా తన సొంత గ్రామానికి వచ్చి 20 కిలోల గంజాయిని ఒకేమూటగా కట్టి తన హీరోహోండా ద్విచక్రవాహనంపై పలాస రైల్వే స్టేషన్ రోడ్డుకు చేరుకున్నాడు. ఆయన తన వాహనాన్ని రైల్వేస్టాండ్‌లో పార్కింగ్ చేసి గంజాయిని రైలులో తరలించేందుకు పథకం వేసుకున్నాడు. ఆయన ద్విచక్ర వాహనంపై గంజాయి ప్యాకెట్‌ను ఎవరికీ అనుమానం రాకుండా తరలిస్తుండడంతో మఫ్టీలో ఉన్న కాశీబుగ్గ పోలీసులు ఆయనపై అనుమానంతో ప్యాకెట్‌ను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. వెంటనే ఆయనను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముద్దాయిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సి శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఈశ్వరరావు, నీలకంఠం, సిబ్బంది పాల్గొన్నారు.

మదనాపురంలో చెక్‌పోస్టు

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామం, సరుబుజ్జిలి జంక్షన్ వద్ద సోమవారం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో ఒరిస్సా నుంచి శ్రీకాకుళం జిల్లా నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ముమ్మరముగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎలక్షన్ డిటి సోమేశ్వరరావు తెలిపారు. ఈ చెక్‌పోస్టు కేంద్రంలో పోలీస్ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం, నగదు అక్రమ తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది